# బుచ్చిబాబు నాటకాలు : ఒక వివేచన

బుచ్చిబాబు మూడు నాటకాలు వ్రాశారు. పదిహేను వరకు నాటికలు వ్రాశారు. ''ఆత్మవంచన'', ''గొలుసు'', '' ఒకేనిద్ర, ఎన్నో కలలు'' ఆయన వ్రాసిన నాటకాలు. చివరి రెండూ విస్తృతికి నాటకాలే అయినా ప్రచారతత్వం ఎక్కువగా కలవి. '' ఆత్మవంచన'' ఒక్కటే కళాత్మకంగా ఉత్తమమైన రచన.

అధునాతన తెలుగు నాటక సాహిత్యంలో ' ఆత్మవంచన'కు ఒక ప్రత్యేకమైన స్థానం వుంది. ఒకటి - దాని సాహిత్య, సాంకేతిక విలువల వలన వచ్చినది; రెండవది దానిలోని కథావస్తువుకు, దాని నిర్వహణకు సంబంధించినది.

తెలుగు నాటకాల పరిస్థితిని చూస్తే - ప్రదర్శన యోగ్యత అన్న నెపంతో అతి పేలవమైన రచనలు ఎక్కువగా వస్తున్నాయన్న సంగతిని ఎవ్వరూ కాదనరు. పదికాలాలపాటు మనగలిగే పటుత్వం గల నాటకాలు బహుకొద్ది. అందులోనూ **1949** తరువాత సాహిత్యపు విలువలు కలిగిన నాటకాలను వేళ్లమీద లెక్కించవచ్చు. అందులో 'ఆత్మవంచన' ఒక ముఖ్యమైన నాటకం.

బుచ్చిబాబు అన్ని రచనల్లోను - కథలైనా, నవల ఐనా, నాటకాలయినా- వ్యక్తుల మానసిక ప్రవృత్తుల వ్యక్తీకరణ వాటి ప్రధాన ధర్మం. ఆయన రచనల్లో ''చివరకు మిగిలేది'', ''ఆత్మవచంన'' ఉత్కృష్టమైనవి. ఆరెంటిలోనూ ఒక వ్యక్తి మానసిక ప్రవృత్తి వేరు వేరు దశలలో విశ్లేషణ చేయడం మనకు కనిపిస్తుంది. ఆ రెండు రచనల్లో సామ్యం, సహయోగిత్వం ఉన్నవి.

'ఆత్మవంచన'లో ఒక స్త్రీ ప్రవృత్తి వివిధ కోణాలలో ప్రదర్శించబడ్డది. ఆమెపేరు కౌముదీ రాణి. ఆమె ధనవంతురాలు. నలుగురూ అందమైనదనడంతో కొంత అహంకారం కలది. ఇంటికి పెద్ద అమ్మాయి కావడంతో అధికారం వచ్చిపడ్డది. ఇన్నీవున్న అమ్మాయి జీవితంలో తనకు కావలసినదేమిటో ఇట్టే అంది పుచ్చుకోవచ్చు. కాని అలా అందుకోలేక పోవడమే రాణి జీవితంలో విషాదం; ఈ నాటకం విషాదాంతం కావడానికి బీజరూపం.

రాణి పాత్ర అతి క్లిష్టమైనది. ఆమెలో బాహ్య, అంతరాల సంఘర్షణ అంతకంతకు ఎలా పెరుగుతూ వచ్చిందో, అది చివరకు ఎలా పరాకాష్ఠకు పోయి, తాను ప్రేమించిన రాజశేఖరాన్నే ఎలా బలికోరిందో, అతి నిశితంగా చూపబడ్డది.

ముందు ఆమె పాత్రలోని బాహ్య, ఆంతర్యాల సంఘర్షణను గురించి:

ఆమె చుట్టూ నలుగురు చేరి ఆమెను కొలుస్తూ వుంటే ఆమెకు ఆనందం; కాని ఆ పని తన యింట్లో వుండి వారాలు చేసుకుంటూ చదువుకున్న రాజశేఖరం చెయ్యడు. కాని ఆంతర్యంలో రాజశేఖరం తనకు దగ్గరగా రావాలని ఆమెకు ఎంతగానో వుంది. అతనికి దగ్గరగా తాను పోవడానికి తన అంతస్తు, అహం అడ్డు వచ్చింది: తాను భాగ్యవంతురాలు, అందమైనది. తన అండనవుండి, అన్నింటికీ తన దయాదాక్షిణ్యాల మీద ఆధారపడ్డ వాడికి దగ్గరగా తాను పోవడం ఏమిటి? తనపై అవసరాలకోసం తనపై యింతగా ఆధారపడినవాడు అర్థంచేసుకొని తన మానసికమైన తృప్తికోసం, ఆనందం కోసం తనకు దగ్గరగా రాకూడదా? అదీకాక ఎందరు భాగ్యవంతులు

తనచుట్టూ తిరగడం లేదు? ఇదీ ఆమె అహంభావ ప్రవృత్తి.

ఇక అంతరాంతరాల్లో ఆమెకు రాజశేఖరం కావాలి. కనీసం రాజశేఖరం తన్ను ప్రేమిస్తున్నాడన్న భావమైనా బలంగా కావాలి. అందుకోసం తాను స్వయంగా మనియార్డర్లు కట్టి అతన్ని చదివించింది. అతడు తన కనుసన్నల్లో మెలుగుతాడని ఆశించింది.

కాని రాజశేఖరం అలా చేయకపోయేసరికి ఆమె అహం దెబ్బతిన్నది. రాజశేఖరాన్ని తనవైపు తిప్పుకోలేకపోయేసరికి ఆమెకు అసూయ, మత్సరం ఎక్కువయ్యాయి. చివరకు తన్ను కాదని, తన ఎదుటనే ప్రేయసితో రాజశేఖరం రావడం ఆమెకు సహించరానిదైంది. పూర్ణిమ (అతని ప్రేయసి) అతన్ని కొంగునకట్టివేసుకోవడం యింకా భరించలేకపోయింది. ఆ మాత్సర్యం ఆమెచేత అబద్ధం ఆడించింది. అది చివరకు పూర్ణిమ ఆత్మహత్యకి దారితీసింది.

ఆమె పూర్ణిమతో ''రాజా నన్ను ప్రేమించాడు. చిన్నప్పటినుంచీ. నిన్నెప్పుడూ చేసుకోడు, చేసుకుంటానని తీసుకొస్తే దగా అన్నమాట'' అని, అప్పుడే రాజశేఖరం తనకిచ్చిన డబ్బును చూపి పూర్ణిమ నమ్మేటట్లు చేస్తుంది. ఈ సంగతి ఆమె చెల్లెలు వాణి పసిగట్టి రాణిని నిలదీసి అడుగుతుంది.

వాణి : పూర్ణిమేదీ?

రాణి : వాళ్ళువాళ్లు రమ్మని అర్జంటు టెలిగ్రాం ఇచ్చారు. రైలు కెళ్ళింది.

వాణి : నిజంగానా?

రాణి : నీతో నే వాదించను.

వాణి : నువ్వేమన్నా అన్నావా? ఏదో చేసుంటావు. లేకపోతే ఎందుకెడుతుందీ? శేఖరం జోలి నీకెందుకు?

రాణి : నోరుముయ్ (కొడుతుంది).

ఎవ్వరైనా తాను చేస్తున్న పనులను పసిగడితే రాణికి విపరీతమైన ఆగ్రహం.

తరువాత కూడా వాణి, రాజశేఖరానికి పూర్ణిమ ఆత్మహత్య చేసుకోబోతూ వ్రాసిన వుత్తరాన్ని చూసి, ''ఇది అక్కయ్య చేసిన పని'' అంటుంది.

ఇన్ని సంఘటనలకు, మలుపులకు కారణమైన రాణి మనస్తత్వాన్ని ఆమే అతి స్పష్టంగా వ్యక్తం చేసుకొన్నది. దెబ్బతిన్న అహం ఎంత దూరంపోయి మనుష్యుల జీవితాలను ఎలా విషభరితం చేయగలదో ఈక్రింది రాణి మాటలు వ్యక్తం చేస్తాయి.

రాణి : స్వతంత్రుడు! ..... పూర్ణిమ కొంగుతో కట్టి పడేసిందిగా! బంట్రోతులా....

వాణి : ఆ కొంగుముడి విప్పేశావుగా!

రాణి : అయ్, వాణీ! నాకు కోపం తెప్పించు .... సన్నైరగవ్ .... నారాయణ, కరుణాకరం, రెడ్డి - వాళ్ళందరికంటె అతను ఎక్కువా? వాళ్ళు నేనెట్లా చెబితే అట్లా వింటారే! వారాలు చేసుకుని బతికిన యీ ఫూల్ ..... ఈ దౌర్భాగ్యుడు .... నన్ను ..... ( ఏడుస్తూ) నన్ను కాదని తృణీకరిస్తాడా?

ఈ మాటలు చాలు ఆమెలోని అహాన్ని, మాత్సర్యాన్ని, ఈర్ష్యని చూపేందుకు.

ఈ సంఘర్షణకు పరాకాష్ఠ నాటకం చివరిభాగంలో చూపబడ్డది. రాజశేఖరం పెద్ద ఆఫీసరైనాడు. తన భర్తకన్న పెద్ద పదవిలో వున్నాడు. పని సూటిగా చేసుకుపోతాడు. తాము చెప్పిన పనులు చేయడానికి నిరాకరిస్తాడు. అన్నింటికన్న తనకు దాసోహం చేయడు. వీటన్నింటికి మత్సరపడి రాజశేఖరాన్ని తుదముట్టించడానికి మందు తీసుకొని అతని యింటికి పోతుంది రాణి.

ఇంట్లో రాజశేఖరం వొంటరిగా వున్నాడు. ఆనాడు అతడిలో వేదాంతం పాలు ఎక్కువగా కనిపిస్తుంది. మనుష్యులు ఎందుకు ద్వేషిస్తారో తనకు తెలిసిందంటాడు. ' ఎందుకు' అని అడుగుతుంది రాణి.

''వారికేం కావాలో తెలియక, తెలిస్తే దాన్ని సాధించడానికి ప్రయత్నిస్తారు....'' అని చెప్పి.

''నీకేం కావాలో చెప్పు. ఇవ్వగలిగిందైతే ఇస్తాను''

ఈ మాటలు చాలు ఆమెను రెచ్చగొట్టడానికి. మొదటిది రాజశేఖరం - ''వారాలు చేసుకు బ్రతికినవాడు'' - తన్ను 'నీకేం కావాలో చెప్పు' అనడం అంతకన్న కోపకారణమైనది: ' ఇవ్వగలిగిందైతే' ఇస్తాననడం. అంటే రాజశేఖరం తనకు యివ్వలేనివి కూడా వున్నాయన్నమాట. అవును, పూర్ణిమకు యిచ్చి తనకు యివ్వని ఆదరం, ప్రేమ వుంది. ఆమె రెచ్చిపోయింది: ''నువ్వు నాకిచ్చేదేమిటి? మేమే యిన్నాళ్లు నీకిచ్చాం'' అని తిప్పికొడుతుంది.

ఎంత నిరసన!

ఎంత అహంకార పూరితమైన ఆవేదన!

రాజాకి తెలుసు ఆమెకేం కావాలో!

కాను తాను యిచ్చే స్థితిలో లేడు.

రాజా : డబ్బా! అదొక్కటే నీకక్కర్లేంది. పొగడ్త, స్నేహం, ఆప్యాయం, ఆంతరంగికం - అవి కావాలి. వాటిని నేను యివ్వలేను. నా బీదరికం మనిద్దరి మధ్య గోడలా వుంది. అది నువ్వు దూకలేవు; నేను పడగొట్టలేను. ట్రాజడీ కదూ?

ఇదీ రాణి జీవితంలో ట్రాజడీ! రాజశేఖరం ఆమెను గురించి ఆమెతోనే చెప్పిన మాటలు రాణి పాత్రను స్పష్టంగా మన ముందు వుంచుతాయి.

''నువ్వు ఎవర్ని ప్రేమించావన్నా నేను నమ్మను. నువ్వు ప్రేమించేది ఒకే వ్యక్తి - ఆ వ్యక్తి నువ్వే''.

''నువ్వు ఎవర్నీ ప్రేమించలేవు. అట్లా అనుకోవడం ఆత్మవంచన.''

రాజా యిలా తన మనసును, జీవితాన్ని తనముందే పరచడం ఆమె సహించలేక పోతుంది. కాని ఆమె నిజస్వరూపాన్ని నగ్నంగా బహిర్గతం చేశాడు.

''నన్ను డబ్బు పేరిట వశం చేసుకుందామనుకున్నావు. అది వీలుపడలేదు. ఇప్పుడు నన్ను చంపి నా శరీరంపైనైనా విజయం పొందుదామనుకున్నావు.''

''నీకా అవకాశం లేదు .... నన్ను నేనే చంపుకోవాలి. నేను బ్రతికివుంటే నీకు సుఖంలేదు... కడసారి త్యాగం చేస్తున్నాను.''

అంటూ ఆత్మహత్య చేసుకుంటాడు.

రాణి జీవితంలో నిజమైన ట్రాజడీ అప్పట్నుంచే ప్రారంభం అవుతుంది. ఆమె తన మనసులో వున్నమాట అతనికి చెప్పాలని ఆరాట పడుతుంది. తన పశ్చాత్తాపం, తనకు అతనిపైనున్న మమకారం విడమరచి చెప్పాలి. కాని అవకాశం లేదు. రాజా మరణించాడు - ''నీ ఋణం తీర్చుకున్నాను'' అని రాణితో చెబుతూ.

రాణి చిట్టచివరి మాటలు (నాటకంలో) ఆమె విషాదవ్యక్తిత్వాన్ని బహిర్గతం చేస్తాయి.

''శేఖరం చచ్చిపొయ్యాడు ... అతన్ని నేను చంపేశాను ... నేనే - అతన్ని చంపటానికొచ్చాననుకున్నాడు ... నేను చంపి వుండను ... నేను చంపలేను ... అతనికి తెలీదు ... నేనా అతన్ని చంపడం? ... కాని ... నేనే ... చంపేశాను.''

ఇంతకన్న ఆమెలో పరస్పర విరుద్ధమైన భావ సంఘర్షణను విప్పిచెప్పడానికి మంచి మాటలేం దొరుకుతాయి? ఇంతకన్న రాజశేఖరంపై తనకు గల ప్రేమను, ఆ ప్రేమ ఆమెలో కలుగచేసిన మాత్సర్యాన్ని తెలియచెప్పేటందుకు మాటలెందుకు? తన అహంకారమే శాపమై తన్ను శపించిన కరుణామయ గాథ రాణిది. ఈ దృష్టితో చూస్తే ఆమె పాత్ర ఎంతో విషాదభరితమైనది, క్లిష్టమైనది.

ప్రతి పాత్ర చిత్రణా ఎంతో చేయి తిరిగిన నాటకకర్త పద్ధతిలో సాగింది. వ్యంగ్యమూ, హాస్యమూ ఒకవైపు, సునిశితమైన నగ్నసత్యం వేరొకవైపు అడుగడుగునా యిందులో చూపబడ్డాయి.

మానవ మనస్తత్వ చిత్రణను వ్యక్తీకరించడానికి గాను బుచ్చిబాబు యీ నాటకంలో ప్రయుక్తం చేసిన వినూత్నమైన విధానం తులనాత్మక పద్ధతి. పరస్పర విరుద్ధమైన ప్రకృతులు గల పాత్రలను ప్రక్క ప్రక్కనే వుంచి వారిచేత నాటకం నడిపిస్తాడు బుచ్చిబాబు. ఈ తులనాత్మకమైన పాత్రచిత్రణ కూడా రెండు అంతస్తుల్లో జరిగింది. ఒకటి : ఒక వ్యక్తిని వేరొక వ్యక్తితో పోల్చడం; రెండవది : ఒకే వ్యక్తి బాహ్య ఆంతర ప్రవృత్తులను పోల్చడం.

ఇందులో ముఖ్యమైన సంఘర్షణ రాణి, రాజశేఖరాల మధ్య. ఇది అంతస్తుల సంఘర్షణ; పరిస్థితుల సంఘర్షణ; వ్యక్తిత్వాల సంఘర్షణ. ఇట్టి సంఘర్షణ విషాదమైన పరిణామాలకు దారితీయ తప్పదు - అన్నదే రచయిత ఈ నాటకం ద్వారా చెప్పదలచుకొన్న సత్యం.

వీరిద్దరికి ప్రతిగా సృష్టించబడినవారు గోపాలం, వాణి. తమకు కావలసిన విషయాలు నిర్దిష్టంగా తెలిసి, వానిని రాబట్టుకోవడం కోసం ప్రయత్నించి, సాధించగలిగినవారు యిద్దరూ - తమ జీవితాలకు గల హద్దుల్ని

తెలుసుకున్నవారు. హాయిగా బ్రతకడం నేర్చుకున్నవారు. ముఖ్యంగా రాణి, వాణి పాత్రల తులనాత్మకత - నాటకాన్ని అర్థం చేసుకోవడానికి మనకు ఎంతగానో వుపకరిస్తుంది. రాణి మనుష్యులను అర్థం చేసుకోలేదు. వాణి అర్థం చేసుకోగలదు. రాణి స్వార్థపరురాలు. వాణికి ఆర్ద్రత వుంది! వ్యక్తులకు వారి వ్యక్తిత్వాలకు విలువనివ్వడం తెలుసు.

రాణి రాజశేఖరాల సమాంతర జీవితం యీ నాటక కథకు ఆయువుపట్టు. వారి జీవితాలు ఎప్పుడూ కలుసుకోలేవు. ఇద్దరూ వారి వారి వ్యక్తిత్వాలను నిలబెట్టుకోవాలన్న దృఢసంకల్పంతో వుండడమే యీ నాటకం విషాదం కావడానికి కారణం.

రాజశేఖరానికి తాను చిక్కుకున్న విపరీతమైన పరిస్థితుల సంక్లిష్టత తెలుసు. మళ్ళీ ఎవరినో పెళ్ళి చేసుకొని ట్రాన్స్‌ఫర్ చేయించుకోరాదా - అని రెడ్డి అడిగితే - రాజా :

''నువ్వనుకున్నంత సింపిల్‌కాదు రెడ్డి. నాకు మళ్ళా యింకొర్ని ప్రేమించడం చేతకాదు. చేసుకున్నా ఆమె జీవితం దుర్భరం అవుతుంది. నాతోపాటు వాళ్ళూ అక్కడికే ట్రాన్స్‌ఫర్ అవుతారు'' అంటాడు.

రాజశేఖరం చెప్పిన ' ఆమె' రాణి. తాను లేకుండా రాణి వుండదని రాజశేఖరానికి తెలుసు. కాని ఆమెను తాను అందుకొనే స్థితిలో లేడు.

''బ్రతకడం అలవాటు చేసుకోవాలంటే కొంత కుట్ర, నటన అవసరం'' అంటాడు రెడ్డి.

''అవుతే నాకు మృత్యువు తప్ప వేరే గత్యంతరం లేదన్నమాట'' అంటాడు రాజశేఖరం.

నాటకం చివర యీ మాటలను అక్షరాల నిజం చేస్తాడు రాజశేఖరం.

ఈ నాటకంలో బుచ్చిబాబు ఉపయుక్తం చేసిన ధ్వని (suggestion)ని గురించి ఒక్కమాట. ఈ నాటకంలోని నాలుగంకాలు కూడా రాణి, వాణిల వాగ్యుద్ధంతోనే ముగుస్తాయి. (ఒక్క రెండోరంగం చివర గోపి, శాంతమ్మల కొద్దిమాటలు తప్ప). ప్రతి అంకం చివర వాణి, రాణిని తాను చేస్తున్న పనులు తప్పులన్న సంగతిని హెచ్చరిస్తూనే వుంటుంది. రాణి ఆ మాటలకు మొదట లెక్కచెయ్యదు: తరువాత కోపగిస్తుంది. ఆ తరువాత కొడుతుంది. చిట్టచివరి అంకంలో ఏమీ చెయ్యలేక ఏడుస్తుంది. ఈ నాలుగు దశల్లో రాణి పాత్రలో వచ్చిన క్రమపరిణామం యీ. ముగింపుల్లో చూడవచ్చు. ఈ విధంగా చూస్తే, వాణి, రాణి పాత్రకు Conscience-keeper అని చెప్పవచ్చు. నిజాన్ని ప్రత్యక్షంగా వాణి చూపుతూనే వుంటుంది. ఆ నిజాన్ని ఆమోదించే మనఃస్థితిలో వుండదు రాణి. ఇది చిట్టచివరి విపరీత పరిణామానికి దారి తీస్తుంది.

'ఆత్మవంచన' నాటకం రచన దృష్ట్యా ఎంత ఉన్నతమైనదైనా, ప్రదర్శన సౌలభ్యం దృష్ట్యా అంత తేలికైనది కాదనే చెప్పాలి. కాని ప్రదర్శన సౌలభ్యమే ముఖ్యం కాదు. కేవలం ప్రదర్శన కోసమే వ్రాయబడుతున్న వందలాది నాటకాలు వెలువడుతున్న యీ తరంలో సాహిత్యం మీద, శిల్పం మీద కూడా కొంత శ్రద్ధ వహించిన 'ఆత్మవచన' వంటి నాటకాలు ఒక రిలీఫ్.

భావితరాలువారు యీ తరం నాటకాలను గురించి కొంచెమన్నా జ్ఞాపకం వుంచుకోవాలంటే 'ఆత్మవంచన' వంటి నాటకాలు యింకా ఎన్నో రావలసి వుంది.

బుచ్చిబాబు వ్రాసిన మిగిలిన రెండు నాటకాలు ''ఒకే నిద్ర - ఎన్నో కలలు'', ''గొలుసు'' ఎన్నో విషయాలలో సామ్యం కలవి. ఈ రెండు ప్రచార నాటకాలుగా ఉద్దేశింపబడ్డవి. ఇటీవల దేశంలోని ముఖ్య సమస్యలైన జాతీయ సమైక్యత, కుటుంబ నియంత్రణ యీ రెండు నాటకాలలోని కథా వస్తువులు. అయితే సాధారణమైన ప్రచార నాటకాలవలె నినాదాలు, ఉపన్యాసాలు, పొగడ్తలు - యీ నాటకాలలో ఎక్కడా కానరావు. అదే బుచ్చిబాబు కళాభిరుచి, శిల్ప ప్రత్యేకత. ఏ నిదృష్ట్యే చూస్తే సామాన్యమైన కథావస్తువును స్వీకరించినప్పుడు కూడా, రచయిత అసామాన్యమైన ప్రతిభ కలవాడయితే, ఆ వస్తు విన్యాసంలో ఎన్ని కొత్త పద్ధతులు, పోకడలు చూపగలడో నిరూపిత మౌతుంది యీ నాటకాలలో.

ఈ రెండు నాటకాలలోని మరో సామ్యం - దాదాపు రెంటిలోని పాత్రలూ - ఒకేవిధంగా వుండడం; సంకుచితమైన మనస్తత్వం గల తండ్రులు, క్రొత్త భావాలను సంతరించుకొని, నూతన మార్గాలవైపు, నిజాయితీతో పయనించాలని వాదించే కొత్తతరం కొడుకులూ, కూతుళ్ళూ; తాము నమ్మినవానిని ధైర్యంగా చెప్పడం, చెయ్యడం - అవి తమ తల్లిదండ్రులకు, పెద్దలకు అయిష్టమైనవైనా - యీ నాటకాల్లోని యువకుల సామాన్య లక్షణాలు. అంతేకాదు. ఈ యువతరం తల్లిదండ్రుల అక్రమాల్ని బహిరంగంగా నిరశించడం, విమర్శించడం. వారు సరిగా తమ విధులను నిర్వర్తించకపోతే - అలా చేయాలని చాటిచెప్పడం. ''ఒకే నిద్ర-''లోని రామయోగి, సుధీర్, శ్రీనివాస్, రాధ - అట్టివారే! ''గొలుసు''లోని రామయోగి, శాంత అట్టివారే!

ఈ యువతలో ఎక్కువ ఆదర్శవాదం కనిపిస్తున్నా - రాను రాను అటువంటి యువతీ యుకులు వస్తున్నారు; వచ్చి దేశప్రగతికి కారకులు కావాలని బుచ్చిబాబు ఆశంస. అందుకే సంకుచిత మనస్తత్వం గల క్రిందటితరం తండ్రులు - వారికి ప్రతిగా ఆదర్శవంతమైన, నిజాయితీగల నేటితరం యువకులు సృష్టింపబడ్డారు.

రామదాసు అనే ఫ్యాక్టరీ యజమాని కొందరు పనివారిని మూడేళ్ళ కాంట్రాక్టుమీద తీసుకుంటాడు. కాని మధ్యలో ఆయన భాగస్వామిగా మానుకొని, మరో భాగస్వామి లక్ష్మణస్వామికి వప్పజెపుతాడు. లక్ష్మణస్వామి పనివాళ్లని తీసేస్తాడు. వాళ్ళు రామదాసును మూడేళ్ళు నిండేవరకు తమ వుద్యోగాలు వుండితీరాలంటారు. లేదా రామదాసైనా పెట్టుకోవాలంటారు. రామదాసు వొప్పుకోడు.

అప్పుడాయన కొడుకు శ్రీనివాసు తండ్రికి వ్యతిరేకంగా అంటాడు. ''అవును నాన్నా? మూడేళ్ళవరకు నువ్వే పెట్టుకోవాలి.''

పెద్దవాళ్ళ మనస్తత్వాన్ని రామయోగి - ఎంత నగ్నంగా, ఎంత నిశితంగా చెప్పాడో!

''నేరం చెయ్యి - పట్టుబడకు - అది మీ నైతిక నిర్వచనం''.

పాత్రపోషణలో రెండు నాటకాలలో సామ్యం వున్నదని వెనుక చెప్పాను. ముఖ్యంగా- రామయోగి పాత్రలో సామ్యం విషయం చెప్పవలసి వుంది. ఈ రామయోగి రెండు నాటకాలలోను వస్తాడు. రెంటిలోను అతను ఉత్సాహవంతుడైన యువకుడు. మొత్తం నాటకానికి జీవం అతని పాత్ర. అతని విమర్శలు, వ్యాఖ్యలు అతి నిశితంగా వుంటాయి. చెప్పదలచుకొన్నది నిర్భయంగా చెప్పగలిగినవాడు. హాస్యము, వ్యంగ్యము, నైశిత్యమూ సమంగా వుంటాయి అతని సంభాషణల్లో.

రామయోగి పాత్రకు బీజం ''చివరకు మిగిలేది''లో ''జగన్నాథం'', ''ఆత్మవంచన''లో ''గోపి'' పాత్రలు. అయితే యీ రెండు పాత్రల్లోవున్న హాస్యము, వ్యంగ్యము రామయోగిలో కూడా వున్నాయి. కాని వారిలోలేని నిశితమైన వ్యాఖ్యానాలు రామయోగిలో వున్నాయి. ఒకవిధంగా యీ పాత్ర రచయిత అభిప్రాయాలకు ప్రతీకాత్మకంగా వున్నది.

మూడవ సామ్యం ఈ రెంటిలోను ప్రయుక్తం అయిన ''గొలుసు'' ప్రతీక. గొలుసు, దానితో తలుపులు బంధింపబడడం, వానిని ఛేదించడానికి ప్రతివాళ్ళు ప్రయత్నం చేయడం, విఫలులు కావడం - యివి రెంటిలోనూ ఎంతో విస్పష్టంగా చూపబడ్డ సంఘటనలు. ఇవి అన్నీ మానవుడి మనస్సులోని గొలుసులు. అతన్ని అనేక రకాలుగా బంధించివేసే బంధాలు.

''గొలుసు'' నాటకంలో నారాయణ (నౌకరు) గొలుసులు వికృతంగా వేళ్ళాడుతూ వుండడం చూసి వాటిని విసిరి పారవెయ్యడానికి ప్రయత్నిస్తాడు. ఆ గొలుసులు పెద్ద భోషాణానికి కట్టి వుంటాయి. ఆ గొలుసులకి, భోషాణానికి, ఆ యింటివారి జీవితానికి చాలా సంబంధం వుంది. ఆ యింటివారి జీవితంలోని బంధాలు ఆ గొలుసులు. ఆ గొలుసులు బిగించిన భోషాణం పాతది. తరతరాల నాటిది. అది గతంనుంచి మనిషి వెలికి రాలేకపోవడానికి ప్రతీక. ఆ భోషాణంలో పెళ్ళానికి సంపాదించిన గొలుసు వుంది. దాన్ని బయటకు తీస్తాడు కుటుంబయ్య. అది బంగారం మీది ఆశ. అదే గతానికి వర్తమానానికి సంబంధం. ఆ గొలుసును అమ్మి డబ్బు సంపాదించి మళ్ళీ పెళ్ళిచేసుకోవాలని కుటుంబయ్య ప్లాను. అంటే వర్తమానానికి భవిష్యత్తుకు సంబంధమన్న మాట. అంటే కాలానికి - ''నాలుగో పరిమాణం'' అన్న నేటి ఆధునికమైన సిద్ధాంతం ద్వారా - ఏ నూతన నిర్వచనం అయితే ప్రచారము చేయబడుతున్నదో, దానిని బుచ్చిబాబు ఎంతో ప్రతీకాత్మకంగా యీ నాటకంలో ప్రయుక్తం చేశాడు.

ఇదే సిద్ధాంతాన్ని యీ నాటకంలోని 'రామయోగి' అన్న పాత్రచేత చెప్పించాడు బుచ్చిబాబు:

''గతం - తన అద్భుత నీడల్ని ప్రస్తుతం పైన ప్రసరింపజేస్తుంది. ప్రస్తుతం భవిష్యత్తుపైన ప్రసరింపజేస్తుంది. వెనుక, ముందు అనే రెండింటి మధ్య కొక్కెంగా కాలం యొక్క గొలుసులో మనిషి బంధించబడ్డాడు. కాలం ఒక గొలుసు. మానవలోకం వొక గొలుసు. సృష్టి వొక గొలుసు .....''

ఇక రెండవ నాటకం ''ఒకే నిద్ర-''లో మానవుడు గొలుసులున్న కవాటాల మధ్య బంధింపబడడం మరో కోణం నుంచి చూపబడ్డది! రామదాసుకు కల వచ్చింది. గదుల మధ్య గోడకు బదులు ఒక గేట్ (గొలుసులతో) బంధింపబడి వుంటుంది. అక్కడ రోడ్డు మూయబడి వుంటుంది.

''ఆ గొలుసు - మనుష్యుల సరిహద్దు - మనుష్యుల ద్వేషానికి సరిహద్దు. ఆ గొలుసులు తెగగొట్టి ఆ ద్వేషం అనే సరిహద్దులు దాటితేనే గాని మనుష్యులు బాగుపడరు'' అనిపిస్తాడు రచయిత. ఇలా మనుష్యుల అవధులను గొలుసుల ద్వారా సూచించి, ఆధునిక మార్గంలో ఒక వినూత్నమైన ప్రతీకను అతి సమర్థవంతంగా చూపాడు బుచ్చిబాబు.

ఇక ఈ రెండు నాటకాలను గురించి వేరువేరుగా రెండు మాటలు: ''ఒకే నిద్ర-'' ''గొలుసు'' కన్న

కళాత్మకంగా, శిల్పదృష్ట్య వుత్తమమైన రచన. ''గొలుసు''లో తాను చెప్పదలుచుకొన్న కుటుంబ నియంత్రణ సిద్ధాంతాన్ని కూడా తాను ఏదో ఒక ప్రచార తత్వాన్ని చెబుతున్నట్లుగా కాక, దాన్ని కేవలం సూచిస్తూ నాటకం నడిపాడు బుచ్చిబాబు. కాని దానిలో అక్కడక్కడ బహిరంగ ప్రకటనలు, సిద్ధాంత చర్చలు తప్పలేదు.

'ఒకేనిద్ర-' జాతీయ సమైక్యతను గూర్చిన నాటకం. కాని ఆ మాట ఎక్కడా చెప్పడు రచయిత. ఒక ఫ్లోర్లో - ఒక కంపెనీలో రామదాసు, లక్ష్మణస్వామి భాగస్వాములు. రామదాసు తెలుగువాడు, లక్ష్మణస్వామి అరవవాడు. ఒకానొక దానయ్యగారు చేరవేసిన తప్పుడు సమాచారాన్ని ఆధారంగా తీసుకొని ఒక కన్నడం అమ్మాయి తల్లి ఆ అమ్మాయికి తన కంపెనీలో ఉద్యోగం యిప్పించమన్నదనుకొని, ఆ వుద్యోగం యివ్వ నిరాకరించిన లక్ష్మణస్వామితో పోట్లాడి తన వాటాను తనకిచ్చివెయ్యమని, తాను భాగస్వామిగా వుండనని ఆయనతో చెబుతాడు. ఈలోగా ఆయన కూతురు రాధ, బెంగాలీ సుధీర్ను ప్రేమించడం, ఆయన కొడుకు శ్రీనివాస్కు లక్ష్మణస్వామి కూతురు మీనాక్షికి సంబంధం వుండడం - చిట్టచివరకు లక్ష్మణస్వామి, రామదాసుల కోపం తగ్గి వాళ్లు మళ్లీ భాగస్వాములు కావడం - కథ.

తన భాగస్వామ్యాన్ని వదులుకోగానే రామదాసుకు కల వస్తుంది. ఆ కల తానొక్కడే బంధితుడైనట్లు, తన వెనుకటి అసూయా, ద్వేషాలనుండి అతడింకా విముక్తుడు కాలేదు. అప్పుడు లక్ష్మణస్వామి వచ్చి ఆ కన్నడం అమ్మాయి తన కూతురేనని, బహిరంగంగా ఆమెను కంపెనీలో చేర్చుకోవడం తనకందుకే యిష్టంలేదని - నిజం చెబుతాడు.

ఈ నాటకంలో ''భిన్నత్వంలో ఏకత్వం'' అన్న భారతీయ లక్షణం (నేషనల్ కార్టెక్టరిస్టిక్) బుచ్చిబాబు చక్కగా చూపాడు. అందరూ చాలా విషయాలలో సమానమైన పట్టుదలలు, కోపాలు కలవారే. అసూయా ద్వేషాలు, ప్రేమానురాగాలు కలవారే. కాని రామదాసు, శ్రీనివాసుల తెలుగుతనం, లక్ష్మణస్వామి లోని అరవతనం మొదలైనవన్నీ అతి నిశితంగా, సూక్ష్మంగా చూపబడ్డాయి.

రామదాసు, లక్ష్మణస్వాములు (వాళ్ళ పేర్లు కూడా ప్రతీకాత్మకాలు) తిరిగి సంధిచేసుకున్న తర్వాత రామయోగి వారిద్దరినీ వుద్దేశించి అంటాడు:

'''మీరుభయులూ, అఖిలభారత్లో ఆర్టిస్టులు - పారిశ్రామిక రంగంలో వ్యక్తిత్వాన్ని రద్దుచేస్తూ రావడమే గొప్ప ఆర్టిస్టు లక్షణం. వ్యక్తిత్వం రద్దయిం తర్వాత ఆర్టిస్టు ప్రపంచానికి చెందుతాడు. అట్లాగే ఒకప్రాంత ప్రజలు, ప్రాంతీయ తత్వాన్ని రద్దుచేసుకుంటూ వస్తే, దేశానికి చెందుతారు. ప్రపంచానికి చెందుతారు.''

ఇదే నాటకానికి తుది పలుకు.

సమైక్యతా భావాన్ని నాలుగు ముక్కల్లో పదునుగా చెప్పి, ప్రచార భావాన్ని మచ్చుకుకూడా తోచనీయక చక్కని నిర్వహణ, అంతకన్న చక్కని ముగింపును చూపాడు బుచ్చిబాబు.

అతి సామాన్యమైన దానిని, అతిలోకంగా తీర్చిదిద్దడం ఆర్టిస్టు చూపే పనితనం. ఆ లెక్కన బుచ్చిబాబు నేటి తెలుగు సాహిత్య శిల్పక్షేత్రంలో ఎన్నో అద్భుతమైన శిల్పప్రతిమలను అతి సున్నితంగా చెక్కి ఆంధ్రుల సంస్కృతీ ప్రాసాదంలో అలంకరించివుంచి భావితరాల వారికి కానుకగా యిచ్చి వెళ్ళాడు.